క్లుప్తంగా

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సౌత్‌జోన్–4 పెన్‌కాక్, సిలాట్ ఛాంపియన్ షిప్ 2023లో ప్రతిభచూపి స్వర్ణ, కాంస్య పతకాలు సాధించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు యు.చిరంజీవి, శ్రీకృష్ణ కేరళలోని తిరువనంతపురంలో జరిగిన సౌత్ ఇండియా పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్–23లో పాల్గొని తమ ప్రతిభ చూపారు. చిరంజీవి స్వర్ణ పతకం సాధించగా, శ్రీకృష్ణ కాంస్య పతకం సాధించారు. మార్షల్ ఆర్ట్స్‌లో వారికి మాస్టర్ పి.సాయికిరణ్ ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. సౌత్ జోన్ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం అనంతలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు పి తిరుపతయ్య, సురేష్ శనివారం అభినందించారు.

కల్వర్టుల పరిశీలన



కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీపీ

చేజర్ల: మండలంలోని చేజర్లలో పొలాలకు వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న కల్వర్టులను ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. చేజర్ల నుంచి తిమ్మాయపాళెం దాటగానే ఈ రోడ్డు మార్గాన పొలాలకు వెళ్లేందుకు సులువుగా ఉంటుందన్నారు. రైతుల వ్యవసాయ పనులకు ఈ మార్గం అనుకూలంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాదేశం.. నా మట్టి కార్యక్రమం



అమృత్ కలశంతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

అల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నా దేశం.. నా మట్టి కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల నుంచి చేరుకున్న కర్తవ్యపథ్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి అన్ని పంచాయతీల నుంచి వచ్చిన కలశాలలో తెచ్చిన మట్టిని కలిపి అమృత్ కలశంలో నింపారు. ఆ అమృత్ కలశంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సురేంద్ర, ఉస్మాన్, నరసింహారావ్, డేవిడ్, వెంకయ్య, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో కరటంపాడు విద్యార్థులు



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అండర్–19 విభాగం విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ ఆటల పోటీల్లో మండల, నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన తమ పాఠశాలకు చెందిన టి.లాస్య, ఈ.సంధ్య, వి.వివేక్, నాయబ్‌రసూల్, వినయ్, కిరణ్ జిల్లా స్థాయికి ఎంపిక అయ్యారు. వీరిలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అండర్ 19 విభాగంలో లాస్య ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాలకొండల రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు మాలకొండయ్య శనివారం తెలిపారు.

పేదల ముంగిటకే కార్పొరేట్ వైద్యం

- దేశంలోనే కనీవినీ ఎరుగని స్థాయిలో వైద్యసేవలు
- చరిత్రలో నిలిచిపోయేలా ఆరోగ్యసురక్ష
- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



బిట్రగుంట: మెడికల్ రిపోర్ట్‌తో కూడిన కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం చరిత్రలో నిలిచిపోతుందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ముంగమూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులతో పాటు నెల్లూరుకు చెందిన పలువురు వైద్య నిపుణులు స్థానికులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచితంగా నేత్రవైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి అద్దాలు అవసరమైన వారికి అద్దాలు అందించేలా సిఫార్సు చేశారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద గ్రామాల్లోనే వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య నిపుణులు నేరుగా గ్రామాలకే వచ్చి సేవలందిస్తుండటంతో ప్రతి ఒక్కరూ వైద్యసేవలు పొందేందుకు అవకాశం ఏర్పడిందని వివరించారు.

కావలికి మహర్దశ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో కావలికి మహర్దశ వచ్చినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్లతో తీర ప్రాంత రూపురేఖలే మారనున్నాయన్నారు. జువ్వలదిన్నె నుంచి రామాయపట్నం వరకు రోడ్ల నిర్మాణంతో పారిశ్రామిక ప్రగతి ఊపందుకోనుందని తెలిపారు. రామాయపట్నం పోర్టు, ఫిషింగ్‌హార్బర్‌లు పూర్తయితే స్థానికంగా యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పేదలు ఆర్థికంగా బలోపేతమయ్యే అవకాశం ఉందన్నారు. వీటితో పాటు అల్లూరులో రూ.పదికోట్లు, కావలిలో రూ.20 కోట్లతో ఆస్పత్రుల ఆధునికీకరణ, కొత్తగా ముసునూరు టోల్‌ప్లాజా వద్ద కొత్తగా ఐదెకరాల స్థలంలో నూతన ఆస్పత్రి నిర్మాణానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, ముంగమూరు సర్పంచ్ సుప్రజ, వైఎస్సార్‌సీపీ నాయకులు మేకల శ్రీనివాసులు, వినోద్, అంకయ్య, సుందర్‌రాజు పాల్గొన్నారు.

14 ఏళ్లలో రూ.6 లక్షల కోట్ల అక్రమ సంపాదన

- చంద్రబాబు దోపిడీ ప్రజలందరికీ తెలుసు
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని 14 ఏళ్లలో సుమారు రూ.6 లక్షల కోట్ల మేర అక్రమ సంపాదనకు పాల్పడ్డారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అన్నీ వ్యవస్థలను తనకు అనుకూలంగా మార్చుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. ఈ రోజు చంద్రబాబు పాపం పండి అక్రమాలు బయటకు వస్తున్నాయని తెలిపారు. 14 ఏళ్లలో స్కాములు, అక్రమాలతో రూ.లక్షల కోట్లు దోపిడీ చేసిన గజదొంగను, ఆర్థిక నేరస్తుడిని చట్టం ముందు నిలబెడితే ఆ పార్టీ నాయకులు, పచ్చ మీడియా గగ్గోలు పెడుతుందని విమర్శించారు. చంద్రబాబును ఆధారాలతో సహా అరెస్ట్ చేస్తే ప్రజలు హర్షించారే తప్ప ఒక్క చోట కూడా నిరసన, ధర్నాలు జరగలేదన్నారు. చివరకు ఆ పార్టీ నాయకులు డబ్బులిచ్చి ధర్నాలు చేయించే పరిస్థితికి దిగజారిపోయారని తెలిపారు. చంద్రబాబును అరెస్ట్ చేస్తే ప్రపంచం తల్లకిందులు అయిపోతుందనే స్థాయిలో పచ్చమీడియా చేస్తున్న హడావుడి చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు చేసిన అక్రమార్జన, అన్యాయాలు, అక్రమాలకు శిక్షపడే సమయం వచ్చిందన్నారు. ప్రజాధనం లూటీ చేసిన చంద్రబాబును, ఆయన కుమారుడు లోకేష్‌ను చట్టం వదిలి పెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ప్రతి ఇంటికి వైద్యం అందించడమే జగనన్న లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- గత ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలే ప్రశ్నించాలి
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: ప్రతి కుటుంబానికి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కావలియడవల్లిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వం వైద్యం అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాంక్షించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి కుటుంబంలోని సభ్యుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి, ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యానికి సిఫార్సు చేస్తున్నారన్నారు. ప్రతి పేదోడికి వైద్యంతో పాటు పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకునేందుకు రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటింటికి పంపి ఆరోగ్య ఆరోగ్య పరిస్థితులను సర్వే చేసి వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2 కోట్ల మందికి 6 రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనని అన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు ఏమి ఇచ్చిందో ప్రజలే ఆ పార్టీ నాయకులను ప్రశ్నించాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు ఏం చేస్తోందో గ్రహించి వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేయాలని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. అందరికి వైద్యం అందాలన్నదే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని, ఎవరూ వెనుకపడకూడదనే ఉద్దేశంతోనే అందరూ సమానంగా ఉండాలన్నదే జగనన్న ఆశయమన్నారు. ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, జేసీఎస్ కన్వీనర్ పులిమి వెంకటరమేష్‌రెడ్డి, సర్పంచ్ విజయమ్మ, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాటంరెడ్డి నారసింహారెడ్డి, వైద్యులు డాక్టర్ మంజుల, డాక్టర్ జ్యోతిరాణి, డాక్టర్ హరిణి, ఎంఎల్‌హెచ్‌పీ పరిమళ, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సీఎం జగన్ బాసట

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రతి పేద వానికి వైద్యం అందిస్తూనే, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు కూడా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శనివారం కావలియడవల్లిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏఎస్‌పేట మండలం అక్బరాబాదుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత శేషారెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.10 లక్షల నగదు ఆమోద పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఎమ్మెల్యే మేకపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అనేక వ్యాధులకు శస్త్ర చికిత్సలు సైతం చేస్తున్నారని, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు వైద్యం చేయించుకోవాలన్న కుటుంబాలకు సైతం బాసటగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

తప్పుడు ధ్రువ పత్రాలతో ఉద్యోగంపై ఫిర్యాదు

చేజర్ల (సోమశిల): నకిలీ దివ్యాంగుల ధ్రువపత్రంతో ప్రభుత్వాన్ని మోసగించి సోమిశెట్టి సుబ్బారావు అనే వ్యక్తి ఉపాధ్యాయ ఉద్యోగం పొందారని ప్రపంచ మానవ హక్కుల సంఘం చైర్మన్ మూరంరెడ్డి సుబ్బారెడ్డి శనివారం అనంతసాగరం ఎంఈఓ బాలకృష్ణారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. సుబ్బారావు ప్రస్తుతం అనంతసాగరం మండలం కచ్చిరదేవరాయపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు అడిగినా అధికారులు తప్పుడు సమాచారం పంపేవారన్నారు. సుబ్బారావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా పొందిన జీతాన్ని రికవరీ చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన విశ్వబ్రాహ్మణ చైర్మన్



విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ఆచారిని సత్కరించిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ఆచారి శనివారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కావలిలోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చిన తోలేటి శ్రీకాంత్ ఆచారికి ఎమ్మెల్యే శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కావలిలోని విశ్వ బ్రాహ్మణసంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఫకీర్‌సాహెబ్ గలేఫ్ ఉత్సవం

అనుమసముద్రంపేట: హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ గంధమహోత్సవంలో భాగంగా మొదటగా ఫకీర్ సాహెబ్ గలేఫ్ ఉత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. హజరత్ శిష్యుల్లో ఒకరైన ఫకీర్ సాహెబ్ ఇంటి నుంచి ఫకీరుల దప్పు వాయిద్యాలు, వారణాసి బాణసంచా, నవరంగ్ మేళాలతో దర్గాకు సీఈఓ మహ్మద్ హుస్సేన్ పర్యవేక్షణలో ఉత్సవం నిర్వహించారు. పీఠాధిపతి ఎస్‌జీఎస్ షఫీఫ్ పాషా సుగంధ ద్రవ్యాలతో గలేఫులు ప్రత్యేక తట్టలో పెట్టారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఫకీర్ సాహెబ్ వంశస్తులు షా నవాబ్ బేగ్ ఆయన కుమారులు సోయల్ బేగ్, రాహిల్ బేగ్, జాకీర్ బేగ్‌లు గలేఫులు పూల దుప్పట్లు, జెండాలు దర్గాకు తీసుకెళ్లారు. దర్గా ఆగ్నేయ భాగంలో ఉన్న నిషాన్ వద్ద జెండాలను ప్రతిష్ఠించారు.

ప్రతి కుటుంబానికి కార్పొరేట్ వైద్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు విద్యార్థులకు అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కొండాపురంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో ఉన్న ప్రతి ఒక్కరికి ఎలాంటి అనారోగ్య సమస్య ఉందో ముందుగా సర్వే చేసి, వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారు. 617 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. 26 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 14 మందికి కంటి అద్దాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు ససరుద్దీన్, సుధీర్, సురేష్, మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ బ్రహ్మయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు

దుత్తలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నందిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంగా ముందుడుగు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, సొసైటీ అధ్యక్షులు తుమ్మల వెంగయ్య చౌదరి, మండ్ల శ్రీనివాసులు, సర్పంచ్ తిప్పిరిబోయిన వెంగయ్య, ఎంపీటీసీ ఎస్తేరమ్మ, జేసీఎస్ మండల కన్వీనరు అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది



మాట్లాడుతున్న సమన్వయకర్త మేకపాటి

కలిగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు నాందిగా నిలుస్తాయని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. కలిగిరిలోని ఆవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో శనివారం 'వై ఏపీ నీడ్స్ జగనన్న' కార్యక్రమంలో నిర్వహించారు. రాజారెడ్డి మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేర వేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. రానున్న 6 నెలలు ఎంతో కీలకమన్నారు. గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, పార్టీ మండల నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పనితీరును విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవశ్యకతకు ప్రజలకు వివరించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ములకా శ్రీనివాసులురెడ్డి, బొర్రా మస్తాన్‌రెడ్డి, దగుమాటి ఆదిశేషారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి బొల్లినేని వెంకట సత్యనారాయణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ రాగి దివ్య, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



భీమవరప్పాడు పంచాయతీలో లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: రాష్ట్రంలోని అన్ని వర్గాల పేదల అభివృద్ధికి పారదర్శకంగా గడపగడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం భీమవరప్పాడు పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాజగోపాల్‌రెడ్డి నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలతో పాటు సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దకే అందిస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సిఫార్సుల మేరకు సంక్షేమ పథకాలను అందజేశారని, వైఎస్సార్‌సీపీతో పాటు ఇరత పార్టీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అందకుండా చేశారని విమర్శించారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కోసం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఉదయగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యారం నరసింహారావు, స్థానిక సర్పంచ్ విడవలపాటి ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ విడవలపాటి మాల్యాద్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామారావు, కమలాకర్, మాల్యాద్రి, మాధవరెడ్డి, మాధవ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు



ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

- ఇష్టారాజ్యంగా తవ్వేయడంతో ప్రమాదకరంగా గుంతలు
- టిడ్కో భవనాలకు పొంచిన ఉన్న ప్రమాదం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరు–ముంబయి రహదారి సమీపంలో టిడ్కో భవనాల వెనుక వైపు రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖలకు సంబంధించిన ప్రభుత్వ పోరంబోకు స్థలాలు, వాగు పోరంబోకు స్థలాల్లో కొందరు అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ శాఖల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే యంత్రాలు పెట్టి రాత్రికి రాత్రే పదుల సంఖ్యలో వాహనాలతో తాటిచెట్లంత లోతైన గోతులు పెట్టి మట్టిని తవ్వేస్తున్నారు. పట్టణానికి సమీపంలో ముంబయి రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ప్లాట్లకు మట్టిని తోలుకునేందుకు రియలర్టర్లు ప్రభుత్వ శాఖల అనుమతులు తీసుకోకుండా తవ్వేస్తుండడంతో పేదలు నివశించే టిడ్కో భవనాల వెనుక వైపు ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. నెల్లూరుపాళెం, జ్యోతినగర్ ప్రాంతాలకు చెందిన పలువురు అక్రమార్కులతో పాటు కొందరు టీడీపీ నేతలు సైతం మట్టి అక్రమ తవ్వకాలు చేపడుతున్నా.. చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. భారీ గోతులు ఏర్పడడంతో కొండవాగు సమీపంలో ఇలా చేయడంతో భవిష్యత్‌లో వరద ప్రమాదం పొంచి ఉంది. మట్టి కోతకు గురైతే టిడ్కో భవనాలు కుప్పకూలే పరిస్థితి నెలకొంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి మూడు జేసీబీ, 40 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తుండగా స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఎవరూ రాకపోవడంతో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపట్టడంపై స్థానికులు మండిపడుతున్నారు. తహసీల్దారు బి రాజేష్‌ను సంప్రదించగా శుక్రవారం రాత్రి ఈ విష యం తన దృష్టికి వచ్చిందని, ఆ సమయంలోనే వీఆర్‌ఏను అక్కడకు వెళ్లాలని ఆదేశించడంతో పాటు పోలీసుల సహకారం తీసుకోవాలని తెలిపినట్లు, ఎస్సైకి ఫోన్ ద్వారా సమాచారం తెలిపి సిబ్బందిని పంపించాలని కోరామన్నారు. పోలీసులు స్పందించలేదన్నారు. వీఆర్‌ఏ అర్ధరాత్రి వరకు అక్కడే ఉండి వెనుదిరిగాడు. కాగా సీపీఎం నాయకులు శనివారం ఆ ప్రాంతాన్ని సందర్శించి అధికారులకు అర్జీ అందజేసినట్లు తెలిపారు.

దేశానికే ఆదర్శం జగనన్న ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని పలువురు అభిప్రాయపడ్డారు. శనివారం వైద్య శిబిరాలు కొనసాగాయి. ఇంటి వద్దే వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి వారికి 5 దశల్లో ఉచితంగా 7 రకాల పరీక్షలు అందించే వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు.



దగదర్తి మండలం దుండిగంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న ఎంపీపీ ప్రసాద్ నాయుడు



వరికుంటపాడు : మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగేంద్ర, చిత్రంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆంద్రా బాల గురవారెడ్డి తదితరులు



ఆత్మకూరురూరల్: మురగళ్లలో మెడికల్ కిట్‌లు అందజేస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి

రాష్ట్రం సుభిక్షం.. భావితరాల భవిష్యత్

- 'వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్'పై ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్ ఎందుకు కావాలంటే రాష్ట్ర సుభిక్షం.. భావితరాల ఉజ్వల భవిష్యత్.. సంక్షేమం..అభివృద్ధి కోసం మళ్లీ సీఎం కావాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. 'వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్' కార్యక్రమంపై నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే కావలిలోని తన నివాసంలో శనివారం రాత్రి సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందించాల్సి సేవలు, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విధానాలు, పచ్చమీడియా కుట్రలను సమర్థవంతంగా తిప్పకొట్టడం తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సుస్థిరమైన సమాజ వికాసానికి వైఎస్ జగన్ సుపరిపాలనతోనే సాధ్యం అవుతోందని వివరించారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. సీఎం లక్ష్యానికి అనుగుణంగా ప్రతి కార్యకర్త ప్రజాసేవే ప్రథమ కర్తవ్యంగా భావించాలన్నారు. సమస్యల పరిష్కారంలో వలంటీర్లను సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం వినూత్న పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తుందని, ఈ పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలంగా కోరుకుంటున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు, పచ్చమీడియా ఎన్ని కుట్రలు చేసినా, కుతంత్రాలకు పాల్పడినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు కన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో జరుగుతున్న విప్లవాత్మక పథకాలు గురించి ప్రజలకు తెలియజేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు విజయవాడలో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారని, నియోజకవర్గ నుంచి 35 మంది పార్టీ నిర్దేశించిన నాయకులతో పాటు ఆసక్తి ఉన్న నాయకులు కూడా రావచ్చని ఎమ్మెల్యే చెప్పారు. ఉదయం 5 గంటలకు తన నివాసం వద్దనే వాహనాలు అందుబాటులో ఉంటాయని ఎమ్మెల్యే వెల్లడించారు.